క్లుప్తంగా

మాసశివరాత్రి పూజలు

నున్న(విజయవాడరూరల్): మాసశివరాత్రి సందర్భంగా సోమవారం నున్న గ్రామంలోని చినకంచిలో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం చండీహోమం, చండీ పారాయణ చేశారు. సాయంత్రం పండితులు చంద్రమౌళీశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష అర్చన, పంచహారతుల సేవ నిర్వహించారు. అలాగే శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో మాసశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విదేశీ విద్యపై ఎడ్యుకేషన్ ఫేర్



పెనమలూరు: కానూరులో పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ, ఐ20 ఫీవర్ సంస్థతో కలిసి సోమవారం విదేశీ విద్యపై ఎడ్యుకేషన్ ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీ మాట్లాడుతూ విద్యార్థులు విదేశీ విద్య అవకాశాన్ని ఉపయోగించుకోవడానికి ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అమెరికా, యూకే, ఐర్లాండ్ దేశాల్లో ఉన్నత విద్య చదువుకోవడానికి పూర్తి సహకారం, సమాచారం అందిస్తామన్నారు. అంతర్జాతీయ సంబంధాల విభాగాధిపతి డాక్టర్ జగదీష్ వెంగల అంతర్జాతీయ విద్యార్థులకు ఉపాధిపై దిశానిర్దేశం చేశారు. వివిధ దేశాలకు చెందిన విశ్వవిద్యాలయాల ప్రతినిధులు, ఐ20 ప్రతినిధులు శ్రీనివాసరాజు, కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

గన్నవరం రూరల్: మండలంలోని మాదలవారి గూడెంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 34 గేదెలకు గర్భకోశ వ్యాధి చికిత్స, 28 దూడలు, 50 గొర్రెలకు నట్టల నివారణ మందు, 15 గేదెలకు జనరల్ వైద్య పరీక్షలు చేశారు. ముస్తాబాద పశువైద్యాధికారి డాక్టర్ మేరీ వైడూర్యం, పంచాయతీ కార్యదర్శి కె.రాజశేఖర్, రామినీడు బసవపూర్ణయ్య, ఎంపీటీసీ సభ్యుడు పి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్గత రహదారులు ప్రారంభం



కంకిపాడు: కంకిపాడు పట్టణంలో రూ. 76 లక్షలతో నిర్మించిన 10 అంతర్గత రహదారులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సర్పంచ్ బాకీ రమణ, స్థానిక నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, చలవాది రాజా, పులి శ్రీనివాసరావు, సుదిమళ్ల రవీంద్ర, పులి కామేశ్వరరావు, ఎంపీడీఓ పి.అనూష పాల్గొన్నారు.

తాగునీరు రంగు మారింది

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ మైక్రోఫిల్టర్ ద్వారా గ్రామ ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరు రంగు మారింది. తాగునీరు ఎరుపు రంగులో వస్తోందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మైక్రోఫిల్టర్ మిషన్ రన్నింగ్‌లో ఏర్పడిన ఒత్తిడి కారణంగా శుద్ధికాబడుతున్న తాగునీరు గ్రామంలోని మినీ ట్యాంకులకు సరఫరా చేసి వినియోగంలోకి వస్తుంది. అయితే ప్రతి మూడు గంటలకు మైక్రోఫిల్టర్‌లో శుద్ధికాబడిన తాగునీటి నుంచి విడిపోయి పేరుకుపోయిన వ్యర్థాలకు రివర్స్‌లో మిషన్ రన్నింగ్ చేయాల్సి ఉంది. అలా కాకుండా ఏకంగా అయిదారు గంటల పాటు శుద్ధిచేసేందుకు మాత్రమే మిషన్ పనిచేయడంతో ఫిల్టర్‌కాక తాగునీరు ఎరుపురంగులో వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

రేపు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ఉంగుటూరు: ఇందుపల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయ 24వ వార్షిక మహోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఉయ్యూరు మురళీ, కార్యనిర్వాహక కార్యదర్శి వక్కలగడ్డ రామచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30 గంటలకు విఘ్నేశ్వరస్వామి పూజతో మహోత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 11 గంటలకు భారీ అన్న సంతర్పణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. భక్తులు సాయినాథుని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ కోరింది.

పికెల్‌బాల్ డబుల్స్ విన్నర్ గోపాలరావు, శ్రీకర్

విజయవాడస్పోర్ట్స్: హైదరాబాద్ ఓపెన్ పికెల్ బాల్ ర్యాకింగ్ డబుల్స్ ట్రోఫీని విజయవాడకు చెందిన కర్రి దోలగోపాలరావు, మోతుకూరి శ్రీకర్ సొంతం చేసుకున్నారు. హైదరాబాద్ కొంపల్లిలోని పికెల్‌బాల్ హబ్‌లో జరిగిన ఈ టోర్నీలో 35 ప్లస్ డబుల్స్ విభాగంలో గోపాలరావు, శ్రీకర్ పాల్గొని అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విన్నర్ టైటిల్ సాధించి విజయవాడ నగర కీర్తిప్రతిష్టలు పెంచిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ పికెల్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.శ్రీధర్ అభినందించారు.

వక్ఫ్ భూములు.. ఉఫ్

- యథేచ్ఛగా ఆక్రమణలు
- ఫిర్యాదు చేసినా చర్యలు నిల్
- బడా బాబుల చేతిలో విలువైన భూములు
- 31న లీజు వేలంపాట జరిగేనా..?



తాడిగడపలో విలువైన వక్ఫ్ భూములు

పెనమలూరు: అత్యంత విలువైన వక్ఫ్ భూములు చేజిక్కించుకోవడానికి బడా బాబులు వేస్తున్న స్కెచ్‌కు అధికారులు వత్తాసు పలుకుతున్నారు. వక్ఫ్ భూములను బడా వ్యక్తుల మద్దతుతో 15 మంది ఆక్రమించారని ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ వక్ఫ్ ఈ నెల 25వ తేదీన పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేసినా నేటి వరకు కేసు నమోదు చేయలేదు. ఇదే అదునుగా ఆక్రమణదారులు వక్ఫ్ భూముల్లో చెలరేగిపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. తాడిగడపలో ఆర్ఎస్ నెంబర్ 79, 173, 176లో 30.04 ఎకరాలు, పెదపులిపాక గ్రామంలో ఆర్ఎస్ నెంబర్ 87లో 12.82 ఎకరాల వక్ఫ్ భూమి ఉంది. ఈ భూమి కొందరి కబంద హస్తాల్లో ఉండటంతో భూములను విముక్తి కలిగించడానికి సాక్షిలో వచ్చిన కథనాలతో జిల్లా అధికారుల ఆదేశాలతో తహసీల్దార్ ఈ నెల 31వ తేదీన ఏక్‌సాల్ లీజు వేలం నిర్వహించడానికి ఉత్తర్వులు ఇచ్చారు.

భూముల్లో అక్రమ ప్రవేశం

వక్ఫ్ భూముల్లోకి బడా వ్యక్తి అండదండలతో వేలంపాట నిర్వహించకుండా అడ్డుకోవడానికి 15 మంది అక్రమంగా ప్రవేశించారు. గత మూడు రోజుల క్రితం రాత్రికి రాత్రే ప్రవేశించి భూములు దున్నారు. గుట్టుచప్పుడు కాకుండా కొంత భూమిలో వరినాట్లు కూడా వేశారు. దీంతో వక్ఫ్ అధికారులు వెంటనే జాయింట్ కలెక్టర్, ఇతర అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. భూములు ఆక్రమించిన వారిపై ఫిర్యాదు చేయాలని ఆదేశించడంతో ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ వక్ఫ్ ఎండీ. నూహూఆలీషా పెనమలూరు పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

ఆక్రమణదారులపై నో యాక్షన్

అత్యంత విలువైన వక్ఫ్ భూములు ఆక్రమించిన వారిపై తహసీల్దార్ కానీ, పెనమలూరు పోలీసులు కానీ ఇంత వరకు ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోలేదు. ఆక్రమణదారులు మాత్రం భూముల్లో తమ కార్యకలాపాలు చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద ఎత్తున సొమ్ము చేతులు మారిందని గుసగుసలు వినబడుతున్నాయి. అధికార పార్టీ నేతల అండదండలతో కేసుకు గ్రహణం పట్టించారని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకుని ఈ నెల 31వ తేదీన వక్ఫ్ భూములకు సజావుగా వేలంపాట నిర్వహించాలని మైనార్టీ సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటికైనా చర్యలు ఉంటాయా ?

కాగా రెవెన్యూ అధికారులు పెనమలూరు పోలీసులు, ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ వక్ఫ్ ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించకపోవడంతో సోమవారం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎండీ.రబ్బాని, ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ వక్ఫ్ ఎండీ. నూహూఆలీషా, వక్ఫ్ అధికారులు జాయింట్ కలెక్టర్‌ను కలిశారు. వక్ఫ్ భూములు ఆక్రమించుకోవడానికి కుట్రలు పన్నుతున్నారని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి జేసీ వెంటనే స్పందించి ఆర్డీవో, తహసీల్దార్‌లను చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి వ్యతిరేకం

రామవరప్పాడు: ఎనికేపాడు పంచాయతీ కార్యాలయం వెనుక 190/1లో 2.26 ఎకరాల విస్తీర్ణం గల చెరువులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి మెజార్టీ పాలకవర్గ సభ్యులు వ్యతిరేకించారు. సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అధ్యక్షతన సోమవారం పంచాయతీ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన అంశాలను పంచాయతీ కార్యదర్శి విద్యాధర్ పాలకవర్గ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా వాల్టా చట్టానికి విరుద్ధంగా చెరువులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణాన్ని ఏ విధంగా చేపడతారంటూ పలువురు పాలకవర్గ సభ్యులు అభ్యంతరం వెలుబుచ్చారు. గ్రామం పుట్టినప్పుటి నుంచి ఉన్న చెరువును కాపాడుకుంటామని మెజార్టీ సభ్యులు ఈ అంశాన్ని వ్యతిరేకించారు. రామయ్య చెరువు కూడా రానూ రానూ ఆక్రమణలకు గురవుతుందని, పడమర వైపు ప్రహరీ గోడ నిర్మించాలని వార్డు సభ్యుడు మాదు సుబ్బారావు సమావేశంలో ప్రస్తావించారు. అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి పనుల అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో వార్డు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి భద్రత నిబంధనలపై అవగాహన



బుర్రకథ ప్రదర్శన చేస్తున్న కళాజాత బృందం

గన్నవరం: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతిఒక్కరూ రహదారి భద్రత నిబంధనలను విధిగా పాటించాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జీవీఎస్ఎన్ మూర్తి సూచించారు. స్థానిక ఎయిర్‌పోర్ట్ ఎదురుగా ఉన్న వాహన పటుత్వ పరీక్ష కేంద్రంలో సోమవారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం బుర్రకథ, పాటల రూపంలో రహదారి భద్రత నిబంధనలపై డ్రైవర్లను చైతన్య పరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్లు ధరించకపోవడం, సీటు బెల్టు పెట్టకపోవడం, అతివేగం వంటి మానవ తప్పిదాల వల్లే ఎక్కువ శాతం ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ఏకాగ్రతతో వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని పేర్కొన్నారు. ఎంవీఐలు ఎ. ఉదయ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జోన్ క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులు



తెన్నేరులో విద్యార్థులతో హెచ్‌ఎం రోజ్ మేరీ, ఉపాధ్యాయులు



సెంట్రల్ జోన్ పోటీలకు ఎంపికైన గన్నవరం విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీలు

కంకిపాడు: పెనమలూరు సబ్‌జోన్ క్రీడల్లో తెన్నేరు జెడ్పీ పాఠశాల క్రీడాకారులు సత్తా చాటారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులను సోమవారం పాఠశాలలో అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం జి.రోజ్ మేరీ మాట్లాడుతూ పెనమలూరు నియోజకవర్గ స్థాయి సబ్‌జోన్ బాలుర క్రీడలు ఇటీవల ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో నిర్వహించారన్నారు. జూనియర్ బాలుర విభాగంలో బాల్ బ్యాడ్మింటన్, ఖోఖోల్లో మొదటి స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు మిరియాల సాయికుమార్‌ను, రాణించిన విద్యార్థులను అభినందించారు. ఎస్ఎంసీ చైర్మన్ లంకా నాగబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గన్నవరం: నియోజకవర్గ స్థాయి సబ్‌జోన్ ఆటల పోటీల్లో స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటి సెంట్రల్ జోన్ పోటీలకు అర్హత సాధించినట్లు హెచ్‌ఎం జీవీ రవిబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఈ నెల 24, 25 తేదీల్లో సబ్‌జోన్ బాలుర విభాగంలో జరిగిన ఖోఖో, షటిల్ విభాగాల్లో సీనియర్, జూనియర్ జట్లు ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. కబడ్డీ జూనియర్ విభాగంలో కేసరపల్లి జట్టుతో కలిసి తమ పాఠశాల సంయుక్తంగా ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. త్రోబాల్ పోటీల్లో సీనియర్ విభాగంలో ద్వితీయ స్థానం, సాఫ్ట్‌బాల్‌లో సీనియర్, జూనియర్ జట్లు ద్వితీయ స్థానాల్లో నిలిచాయని తెలిపారు. విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు, షేక్ మీరాసాహెబ్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ ఎంవీ ప్రకాష్‌ను అభినందించారు.

రేమల్లే విద్యార్థుల ప్రతిభ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రేమల్లే జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సబ్‌జోన్ ఆటల పోటీల్లో సత్తా చాటారు. గన్నవరంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఇటీవల జరిగిన సబ్‌జోన్ పోటీల్లో రేమల్లే వాలీబాల్ జట్లు పతకాలను కైవసం చేసుకున్నట్లు ప్రధానోపాధ్యాయుడు ఎస్.లూథర్ పాల్ సోమవారం తెలిపారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో రేమల్లే జట్లు ద్వితీయ స్థానాన్ని సొంతం చేసుకున్నాయని వివరించారు. వ్యాయామోపాధ్యాయుడు డి.వెంకటేశ్వరరావుతో పాటుగా పతకాలు సాధించిన క్రీడాకారులను హెచ్‌ఎం అభినందించారు.

రోడ్డు పనుల పరిశీలన



పెరికీడు- పెదపాడు రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతమనేని

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడు నుంచి ఏలూరు జిల్లా పెదపాడు వెళ్లే ఆర్ అండ్‌బీ రహదారి నిర్మాణ పనులను రాష్ట్ర రోడ్డు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి పెరికీడు వద్ద రోడ్డు నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. పెరికీడు వంతెన వద్ద పెదపాడు రోడ్డును 216హెచ్ జాతీయ రహదారికి అప్రోచ్ రోడ్డుగా అనుసంధానం చేయకపోవడంపై మంత్రి జనార్దన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుచోట్ల కల్వర్టుల నిర్మాణం కూడా పూర్తి కాకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వేగిరెడ్డి పాపారావు, పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణంపై ఫిర్యాదు

పెనమలూరు: కానూరు ప్రధాన రహదారి పక్కన డ్రెయినేజీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారని గ్రామస్తులు పీజీఆర్ఎస్ (మీకోసం)లో సోమవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కానూరుకు చెందిన వంగర నాగరాజు తన ఫిర్యాదులో వివరాలు తెలుపుతూ కానూరు ప్రధాన రహదారి మాస్టార్ ప్లాన్‌లో 60 అడుగుల రోడ్డు ఉందన్నారు. అయితే తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ (ఆర్‌డీపీ) సిద్ధం చేయకుండా ప్రధాన రహదారిని 40 అడుగులకు మార్కింగ్ ఇచ్చి డ్రెయినేజీ పనులు చేయిస్తున్నారని తెలిపారు. దీని కారణంగా కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: శ్రీరామ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధి కేసీపీ కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా కానూరులో మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా 100 అడుగుల రోడ్డు, కేసీపీ కాలనీ, శైలేష్ అకాడమీ, పంటకాలువ రోడ్డు, సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు



కలెక్టర్ డీకే బాలాజీ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ సునీల్



దుర్గారావమ్మ, వీఆర్‌ఓ కంకిపాడు



ప్రణవి, ఎంపీడీవో పెనమలూరు



సత్యకుమార్, ఎంపీడీవో ఉంగుటూరు



కృష్ణనాయక్, విద్యుత్ శాఖ ఈఈ



బి.వెంకటేశ్వరరావు, ఉప్పలూరు పంచాయతీ కార్యదర్శి



ఎల్‌టీ అనురాధ, గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్, కంకిపాడు



ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న వీఆర్‌ఓ సుబ్రహ్మణ్యం

కంకిపాడు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పలువురు ఉద్యోగులకు జిల్లా స్థాయిలో ఉత్తమ సేవా అవార్డులు లభించాయి. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మచిలీపట్నంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చేతులమీదుగా కంకిపాడు వీఆర్‌ఓ గొంతెన దుర్గారావమ్మ, సర్వేయరు భాస్కర్‌రావు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి భాగ్యశ్రీ, ఉప్పలూరు పంచాయతీ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ కైలే సునీల్ ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్నారు. ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్ చేతులమీదుగా వేల్పూరు వీఆర్‌ఓ సుబ్రహ్మణ్యం, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంతి అవార్డులు అందుకున్నారు. అవార్డులను అందుకున్న ఉద్యోగులను తహసీల్దార్ వి.భావనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది అభినందించారు.

ఉంగుటూరు: ఉత్తమ ఎంపీడీవోగా ఉంగుటూరు ఎంపీడీవో ఇ.సత్యకుమార్ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నుంచి అవార్డును అందుకున్నారు. అలాగే పెద్ద అవుటపల్లి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మాదేవి, ఇందుపల్లి పశువైద్య అధికారి సుధీర్, ఉపాధి హామీ పథకం తేలప్రోలు ఫీల్డ్ అసిస్టెంట్ గంగవరపు విజయకుమారి ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు.

ఉయ్యూరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉయ్యూరు మండలంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఉత్తమ సేవలు అందించినందుకుగానూ కలెక్టరు డీకే బాలాజీ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. విద్యుత్ శాఖ ఈఈ కృష్ణనాయక్, లైన్‌మెన్ చంద్రశేఖర్, కాటూరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ఎస్.హిమా ఉమామహేశ్వరి అవార్డులు అందుకున్నారు.

రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఆక్రమణలు

- ప్లాట్ల యాజమానుల ఆందోళన
- కలెక్టర్‌కు ఫిర్యాదు



అంపాపురంలోని లే అవుట్ వద్ద ప్లాట్ల యాజమానుల ఆందోళన

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం అంపాపురంలోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌ను ఆక్రమించడంతో ప్లాట్ల యాజమానులు ఆందోళనకు దిగారు. గ్రామంలోని రీ సర్వే నంబర్లు 203, 205, 206, 207, 210, 213లో వీవీఆర్ హౌసింగ్ సంస్థ ప్యారడైజ్ ఫేజ్-1, 2 పేరుతో 2009 నుంచి 2014 మధ్యకాలంలో ప్లాట్ల అమ్మకాలు సాగించడంతో దాదాపు 700 మంది కొనుగోలు చేశారు. ప్లాట్ల యాజమానులంతా స్థానికేతరులు కావడం, గత కొంతకాలంగా ఆ ప్లాట్లు ఖాళీగా ఉండటంతో భూ కబ్జాదారుల కన్ను పడింది. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు కొద్దిరోజుల క్రితం ఈ భూమిలో ప్లాట్ల సరిహద్దు రాళ్లు తొలగించి వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న ప్లాట్ల యాజమానులు సోమవారం అంపాపురం చేరుకున్నారు. లే అవుట్ వద్ద సమావేశమై ఆందోళన నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి మచిలీపట్నం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని, ధ్వంసం చేసిన ప్లాట్ల సరిహద్దు రాళ్లు పునరుద్ధరించేందుకు సర్వే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, చిరు వ్యాపారులు తమ పిల్లల భవిష్యత్ కోసం కూడబెట్టిన సొమ్ముతో ప్లాట్లు కొనుగోలు చేశామని, ఇప్పుడు కబ్జాకు గురికావడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నామని వాపోయారు.

సాహిత్యం సమకాలీనమై ఉండాలి



యోధ కథా సంకలనం పరిచయ సభలో ఇంతియాజ్, గోళ్ల నారాయణరావు, శాంతిశ్రీ తదితరులు

విజయవాడ కల్చరల్: సాహిత్యం సమకాలీనమై ఉండాలని, అదే కాలానికి నిలుస్తుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. సమన్విత సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ భవనంలో సోమవారం యోధ కథా సంకలన పరిచయ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ కవులు, రచయితలు సమాజాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. యోధ కథా సంపుటిలోని కథలు వాస్తవ జీవితాలకు అద్దం పట్టాయన్నారు. రచయిత్రి దుట్టా శమంతకమణి సంకలనంలోని రచయిత్రుల కృషిని అభినందించారు. నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వివక్షత, స్త్రీ కేవలం విలాస వస్తువు కాదన్న సందేశాన్ని ఆయా రచనల్లో వివరించారని పేర్కొన్నారు. సమావేశంలో సాహితీ ప్రముఖులు గోళ్ల నారాయణరావు, చలపాక ప్రకాష్, అరసవల్లి కృష్ణ, కోపూరి పుష్పాదేవి, అనిల్ డ్యానీ, వడ్లమూడి పద్మ, శాంతిశ్రీ కే ఉషారాణి కథా సంపుటి విశేషాలను వివరించారు. సాహితీప్రియులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆహ్వాన నాటకోత్సవాలు ప్రారంభం



'మూల్యం' నాటికలో ఓ సన్నివేశం

విజయవాడ కల్చరల్: తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్రనాటక కళాసమితి ఆధ్వర్యంలో ఏపీ భాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో మూడురోజులపాటు నిర్వహించనున్న 8వ ఆహ్వాన నాటకోత్సవాలు గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి నాటక ప్రదర్శనగా వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించిన 'గురితప్పిన వేట' రెండో ప్రదర్శనగా డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వం వహించిన 'మూల్యం' నాటికను ప్రదర్శించారు. సినీ నిర్మాత ఎస్.మల్లికారెడ్డి జ్యోతిని వెలిగించి ఈ నాటకోత్సవాలను ప్రారంభించారు. పారిశ్రామికవేత్త అంబటి మధుమోహన కృష్ణ మాట్లాడుతూ నాటకానికి పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు సూర్యదేవర జగన్నాథరావు మాట్లాడుతూ సంస్థ లక్ష్యాలను వివరించారు. ఆయా రంగాలకు చెందిన వేముల హజరత్తయ్యగుప్తా, డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, దొంతాల ప్రకాష్, బొర్రా నరేన్, ఉన్నవ రాధారాణి తదితరులు పాల్గొన్నారు. నాటకోత్సవాల్లో భాగంగా జానపదగాయని డాక్టర్ అరుణా సుబ్బారావును ఘనంగా సత్కరించారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

పెనమలూరు: పోరంకిలో ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం లోయపల్లి గ్రామానికి చెందిన మండ్లి బయసీకి ఇద్దరు కుమారులు. వారు పోరంకిలోని ఓ కాలేజీలో ఇంటర్ చదువుతున్నారు. ఈ నెల 25వ తేదీన ఎం.బయలీ తన ఇద్దరు కుమారులతో పాటు చెల్లెలి కుమార్తెతో కలిసి పోరంకికి వచ్చాడు. ఇద్దరు కుమారులను పోరంకి బస్‌స్టాండ్ వద్ద ఉండమని చెప్పి చెల్లెలి కుమార్తెను కాలేజీలో దించి రావడానికి వెళ్లాడు. అయితే అతను తిరిగి వచ్చే సరికి రెండవ కుమారుడు బ్రహ్మం పోరంకి బస్‌స్టాండ్ వద్ద కనబడలేదు. పెద్దకుమారుడిని బ్రహ్మం ఎటువెళ్లాడని అడగగా తాను చూడలేదని చెప్పాడు. బయసీ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వేధింపుల భర్తపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీకి చెందిన వరదండి దుర్గ భవానీ, కరుణాకర్ భార్యాభర్తలు. వీరికి 14 ఏళ్ల కిందట వివాహం కాగా, ఇద్దరు సంతానం. భార్యాభర్తలిద్దరూ వీఎంసీలో ఉద్యోగాలు చేస్తుంటారు. మద్యానికి బానిసైన కరుణాకర్ కొంత కాలంగా భార్య, పిల్లలను వేధింపులకు గురి చేస్తుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.